లోకం పోకడ



హలో... నేను ఇంటికొచ్చే సరికి లేటవుతుంది.. ఇక్కడ సీఎం అభ్యర్థులతో రోడ్డంతా జామ్ అయ్యింది..!

కాంగ్రెస్‌లో కుతకుత

- పార్టీలో తారస్థాయికి అసంతృప్తి సెగలు
- టికెట్లు దక్కకపోవడంపై నేతల ఆగ్రహం
- ఎక్కడికక్కడ నిరసనలు.. రేవంత్‌రెడ్డి బిష్టిబొమ్మల దహనం
- గాంధీభవన్‌ను ముట్టడించిన చిన్నారెడ్డి, కాట శ్రీనివాస్, బెల్లయ్య నాయక్ వర్గం
- ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ఖాళీ
- రెబల్‌గా బరిలో నిలిచే ఆలోచనలో పలువురు కాంగ్రెస్ నేతలు
- జాబితాలో ఎడవల్లి కృష్ణ, మానవతారాయ్, కాట శ్రీనివాస్‌గౌడ్

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బీరంగూడలో అర్ధరాత్రి కాంగ్రెస్ శ్రేణుల విధ్వంసం

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీరు మారడం లేదు. మారే పరిస్థితులు కూడా కనిపించడం లేదు. నేతల మధ్య కొట్లాటలు, తన్నులాటలతో టికెట్ల పంచాయితీ తారస్థాయికి చేరింది. అసంతృప్త నేతల ధర్నాలు, నిరసనలతో గాంధీభవన్ దద్దరిల్లింది. టికెట్లు దక్కని నేతలు భగ్గుమంటున్నారు. ధర్నాలు, నిరసనలతో అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. పలుచోట్ల ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. టికెట్లు దక్కని నేతలు, వారి అనుచరులు గాంధీభవన్‌పై దండయాత్ర చేశారు. పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పటాన్‌చెరు, వనపర్తి, నారాయణఖేడ్, బోథ్, నర్సాపూర్ నేతలు తమ నియోజకవర్గాల్లో ఆందోళన నిర్వహించారు.

దద్దరిల్లిన గాంధీభవన్

టికెట్ ఆశించి భంగపడిన నేతల అనుచరుల ఆందోళనలతో గాంధీభవన్ దద్దరిల్లింది. బెల్లయ్యనాయక్, చిన్నారెడ్డి, కాట శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు గాంధీభవన్‌లో నిరసనకు దిగారు. ఆందోళనకు దిగిన కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. నారాయణఖేడ్ టికెట్‌ను సురేశ్ షెట్కార్‌కు కేటాయించడంపై సంజీవరెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోథ్‌లో ఇప్పటికే ప్రకటించిన వెన్నెల అశోక్‌ను మార్చి కొత్త అభ్యర్థి అదె గజేందర్‌కు టికెట్ ఇవ్వడంతో అశోక్ వర్గీయులు బోథ్‌లో రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

కరీంనగర్ కాంగ్రెస్‌లో విభేదాలు

> కరీంనగర్ టికెట్‌ను పురమల్ల శ్రీనివాస్‌కు కేటాయించడంతో మంగళవారం కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నాకు దిగారు. అనేక భూదందాలు, భూ ఆక్రమణ కేసుల్లో నిందితుడిగా ఉన్న బొమ్మకల్ సర్పంచ్ పురమల్లకు టికెట్ ఎలా కేటాయిస్తారని నిలదీశారు. ఆయనపై 24కు పైగా భూకబ్జా కేసులు ఉన్నాయని గుర్తు చేశారు.

గాంధీభవన్ నుంచి వెళ్లిపోయిన చిన్నారెడ్డి

సీనియర్ నేత చిన్నారెడ్డికి తొలుత టికెట్ కేటాయించి తిరిగి రద్దు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయనకు వనపర్తి టికెట్ కేటాయించిన అధిష్ఠానం ఆ తర్వాత దానిని మెగారెడ్డికి కేటాయించింది. మంగళవారం ముభావంగానే గాంధీభవన్‌కు వచ్చిన ఆయన అక్కడ తన అనుచరులతో సమావేశమయ్యారు. జరిగిన అవమానాన్ని కార్యకర్తలతో పంచుకొని బాధపడ్డారు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆగ్రహించిన అనుచరులు గాంధీభవన్‌లోనే ధర్నాకు దిగారు.

రెబల్‌గా బరిలోకి

టికెట్ల కేటాయింపులో తమకు జరిగిన అన్యాయంపై అసలు కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరుగా తమ నిరసనగళాన్ని విప్పుతున్నారు. ఈ క్రమంలో కొందరు రాజీనామాలు చేస్తుంటే మరికొందరు రెబల్‌గా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. టికెట్ల ప్రకంపనలతో ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ మొత్తం ఖాళీ అయింది. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ సహా నేతలంతా పార్టీకి రాజీనామా చేశారు. పటాన్‌చెరువు టికెట్ ఆశించిన కాట శ్రీనివాస్‌గౌడ్, సత్తుపల్లి టికెట్ ఆశించిన మానవతారాయ్, కొత్తగూడెం టికెట్ ఆశించి భంగపడిన ఎడవల్లి కృష్ణ కాంగ్రెస్‌పై రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

కాంగ్రెస్‌కు కిరణ్‌కుమార్ రాజీనామా

భైంసా: నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను నారాయణరావు పటేల్‌కు కేటాయించడంపై మరోనేత డాక్టర్ కిరణ్‌కుమార్ కొమ్రెవార్ వర్గంలో ఆగ్రహం వ్యక్తమైంది. మంగళవారం ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన అనుచరులు కాంగ్రెస్ జెండాలను తగలబెట్టారు. ప్లెక్సీలను చించివేశారు.

సత్తుపల్లి కాంగ్రెస్‌లో పలువురు రాజీనామా

కల్లూరు: సత్తుపల్లి టికెట్‌ను సీనియర్ నేత సంభాని చంద్రశేఖర్‌కు కాకుండా కొత్తగా చేరిన వ్యక్తికి టికెట్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంభాని వర్గీయులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలం రామకృష్ణాపురంలో వారు సమావేశమయ్యారు. సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు.

కొడంగల్‌లో కాంగ్రెస్ దౌర్జన్యం

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని రావులపల్లిలో మంగళవారం రాత్రి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులతో కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగడంతో ఉద్రిక్తత ఏర్పడింది. విషయం తెలిసిన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మంత్రి మహేందర్‌రెడ్డి గ్రామానికి చేరుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు పెద్ద ఎత్తున గ్రామానికి చేరుకుని ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు.

రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం

బంజారాహిల్స్: పార్టీ కోసం ఏండ్ల తరబడి కష్టపడుతున్న కాటం శ్రీనివాస్‌గౌడ్‌కు కాకుండా పార్టీ సభ్యత్వం కూడా లేని నీలం ముదిరాజ్‌కు పటాన్‌చెరువు టికెట్ ఎలా ఇస్తారంటూ మంగళవారం వందలాదిమంది కార్యకర్తలు రేవంత్‌రెడ్డి నివాసం ముట్టడికి యత్నించారు. రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రూ. 100కోట్లకు నీలం ముదిరాజ్‌కు టికెట్ అమ్ముకున్నాడంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రేవంత్.. కొడంగల్ టికెట్ నాకివ్వు

తనకు టికెట్ దక్కకపోవడంపై ఆ పార్టీ సీనియర్ నేత బెల్లయ్య నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు మూడు చోట్ల టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆయనకు ఎక్కడా టికెట్ ఇవ్వలేదు. సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ టికెట్ తనకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఎలాగూ కామారెడ్డికి వెళ్లారని, ఆయనకు రెండు సీట్లు ఎందుకని ప్రశ్నించారు. గాంధీ విగ్రహం వద్ద దీక్షకు దిగిన ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు.

పటాన్‌చెరువులో రాజనర్సింహ వర్సెస్ జగ్గారెడ్డి

- తన వారికే టికెట్ ఇవ్వాలంటూ ఇద్దరూ పట్టు
- నీలం మధుకు ఇవ్వడంపై రాజనర్సింహ ఆగ్రహం
- కాట శ్రీనివాస్‌గౌడ్ కోసం ఆయన పట్టు
- టికెట్‌పై రూ. 30 కోట్ల భారీ డీల్?

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): పటాన్‌చెరు టికెట్ విషయంలో సీనియర్ నేతలు జగ్గారెడ్డి, దామోదర రాజనర్సింహ మధ్య దుమారం రేగినట్టు తెలిసింది. వీరిద్దరూ ఆ టికెట్‌ను తమవారికి ఇవ్వాలంటే తమవారికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. నీలం మధుకు జగ్గారెడ్డి, కాట శ్రీనివాస్‌గౌడ్‌కు రాజనర్సింహ మద్దతు పలుకుతున్నారు. మూడో జాబితాలో పటాన్‌చెరువు టికెట్‌ను పార్టీ అధిష్ఠానం నీలం మధుకు కేటాయించడంతో దామోదర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న శ్రీనివాస్‌గౌడ్‌ను కాదని, నాలుగు రోజుల క్రితం పార్టీలో చేరిన మధుకు టికెట్ ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. మధుకు ఇచ్చిన టికెట్‌ను రద్దు చేసి శ్రీనివాస్‌గౌడ్‌కు కేటాయించాలని ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. దీనిపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇచ్చిన టికెట్‌ను రద్దు చేస్తే ఊరుకునేది లేదంటూ పార్టీ పెద్దలకు అల్టిమేటం జారీ చేసినట్టు సమాచారం. మరోవైపు, పటాన్‌చెరు టికెట్‌కు సంబంధించి సుమారు రూ. 30 కోట్ల డీల్ కుదిరినట్టు ప్రచారం జరుగుతున్నది. తాను సూచించిన వారిలో ఒక్కరికి కూడా టికెట్ దక్కకపోవడంపై దామోదర అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. పఠాన్‌చెరు, నర్సాపూర్, నారాయణఖేడ్ టికెట్లను తాను సూచించిన వారికి కాకుండా ఇతరులకు కేటాయించడంపై ఆయన ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది.

ఏపీ షర్మిల.. గో బ్యాక్

- తెలంగాణలో వైఎస్సార్టీపీ క్లోజ్
- పార్టీని కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టింది
- తెలంగాణలో పోటీచేస్తే తరిమికొడుతాం
- వైఎస్సార్టీపీ నేతల స్పష్టీకరణ
- మూకుమ్మడిగా పార్టీకి రాజీనామాలు

ఖైరతాబాద్, నవంబర్ 6: తెలంగాణలో వైఎస్సార్టీపీ పని అయిపోయిందని, దీంతో ఆ పార్టీ నుంచి నిష్క్రమిస్తున్నామని పలువురు నేతలు స్పష్టం చేశారు. ఆ మేరకు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్టు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రకటించారు. 'ఏపీ షర్మిల.. గో బ్యాక్' అంటూ పెద్దపెట్టున నినదించారు. వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు గట్టు రాంచందర్‌రావు, బోయినపల్లి సత్యవతి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షర్మిలను కేవలం రాజన్న బిడ్డ అన్న ఏకైక కారణంతో ఆదరించామని, చివరకు ఆమె తెలంగాణపైనే కక్ష కడుతుందనుకోలేదని తెలిపారు. వైఎస్సార్టీపీని నిలబెట్టేందుకు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చామని, చివరకు లాఠీ దెబ్బలు తిని జైళ్లకు వెళ్లామని చెప్పారు. చెమటోడ్చి పార్టీని నిలబెట్టాలని చూస్తే కాంగ్రెస్‌లో విలీనం చేస్తానంటూ నియంతృత్వంతో షర్మిల ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్టీపీ కోసం రూ.లక్షలు ఖర్చుపెట్టి అప్పుల పాలయ్యామని, ఇలాంటి తరుణంలో పార్టీని నడిసంద్రంలో వదిలి కాంగ్రెస్ పంచన చేరడం దారుణమని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆమెను కలిస్తే.. 'నీ ముఖం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావా' అంటూ నీచంగా మాట్లాడారని వాపోయారు. ఇన్నేండ్లు ఆమె నాయకత్వాన్ని బలపర్చినందుకు సిగ్గుపడుతున్నామని, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబుతున్నామని తెలిపారు. నియంతృత్వ మనస్తత్వం కలిగిన షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ నష్టం జరుగుతుందని, ఆమెను చేర్చుకుంటే కాంగ్రెస్‌ను సైతం వెలేస్తామని హెచ్చరించారు.

రాళ్లతో కొట్టి ఆంధ్రాకు తరుముతాం..

బయ్యారం గుట్టను, తెలంగాణను దోచుకోవడానికే షర్మిల ఇక్కడికి వచ్చారని, పనికిరాని పార్టీని పెట్టి ఎంతో మంది జీవితాలతో ఆడుకున్న ఆమెను తెలంగాణ నుంచి బహిష్కరిస్తున్నామని వైఎస్సార్టీపీ నాయకుడు గణేశ్ నాయక్ తెలిపారు. తెలంగాణలో ఆమె ఎక్కడ పోటీచేసినా రాళ్లతో కొట్టి ఆంధ్రాకు తరమికొడతామని హెచ్చరించారు. అనంతరం రాజీనామా పత్రాలను ప్రదర్శించి, కండువాలను తీసివేశారు. సమావేశంలో వైఎస్సార్టీపీ నేతలు సంజీవరావు, గౌతం ప్రసాద్, డానియల్, శాంత్‌రాజ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీసీ సీఎం లొల్లి

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో మరొ కొత్త పంచాయితీ మొదలైంది. మొన్నటివరకు బీసీలకు అత్యధిక సీట్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేసిన ఆ పార్టీ నేతలు ఇప్పుడు ఏకంగా బీసీ సీఎం డిమాండ్‌ను ఎత్తుకున్నారు. బీసీ సీఎంను ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆ పార్టీ సీనియర్ నేతలు వీ హన్మంతరావు, కత్తి వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు ఎక్కువ సీట్లివ్వాలని తొలి నుంచి ప్రయత్నించినా అది సాధ్యం కాలేదని కత్తి వెంకటస్వామి తెలిపారు. దాన్ని భర్తీ చేసేందుకు బీసీకి సీఎం పదవి ఇవ్వాలని కొట్లాడుతామని తెలిపారు. అయితే దీనిపై సెటైర్లు పేలుతున్నాయి. ఆలూ లేదు సూలు లేదు.. కొడుకు పేరు.. ఏదో అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అభ్యర్థులనే ప్రకటించలేదు.. ఎన్నికలే కాలేదు. అప్పుడే వీరంతా సీఎం భ్రమల్లో తేలియాడుతున్నారని స్పష్టం చేస్తున్నారు. ఓసీ సీఎం, దళిత సీఎం డిమాండ్లు పూర్తయ్యాయని, ఇక ఇప్పుడు బీసీ సీఎం లొల్లి మొదలైందని చెప్తున్నారు.

కాంగ్రెస్ మాటల్లో కాళేశ్వరంపై కుట్ర!

- త్వరలో మరో రెండు బరాజ్‌లు కూలుతాయంటున్న కోమటిరెడ్డి
- ఓ కాంట్రాక్టర్ అయి ఉండికూడా ప్రాజెక్టుపై అనుమానపు మాటలు
- కాంగ్రెస్ నేతలకు ముందే ఎలా తెలుసంటూ ప్రజల్లో సందేహాలు
- ఇది ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రగా అనుమానం

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరం ప్రాజెక్టు కడితే సగం బరాజ్ కూలిపోయింది. ఇంకా రెండు బరాజ్‌లు వారం పదిరోజుల్లో కూలిపోబోతున్నాయి..' ఇవీ నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో కాంగ్రెస్ ఎంపీ, నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు. ఓ కాంట్రాక్టర్ అయి ఉండి.. ప్రాజెక్టు నిర్మాణంపై పరిపూర్ణ అవగాహన కలిగి ఉండికూడా కోమటిరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కాళేశ్వరంపై కుట్రకోణం ఉన్నదనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌లో 265 పిల్లర్లలో ఒక పిల్లర్ పాక్షికంగా కుంగిపోయింది. ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి ఇసుక కొట్టుకుపోవడంతో సమస్య వచ్చిందని తేల్చారు. క్వాలిటీ ఆఫ్ సౌండ్, క్వాలిటీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌పై అనుమతులున్నాయని వెల్లడించారు. పిల్లర్ కుంగుబాటుతో బరాజ్‌కు ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు. ఒప్పందం ప్రకారం వీటి నిర్వహణ బాధ్యత ప్రాజెక్టును నిర్మించిన కంపెనీదేనని, ఆ కంపెనీనే మరమ్మతు చేస్తుందని చెప్పారు. అయినా.. ఓ కాంట్రాక్టర్ అయి ఉండి.. ప్రాజెక్టు నిర్మాణం, అందులోని లోటుపాట్లు తెలిసిన కోమటిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేయడం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ ఏదో కుట్ర చేస్తున్నదనే అనుమానాలకు తావిస్తున్నది.

మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటు కుట్ర కోణమేనా?

తెలంగాణ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌లోని ఓ పిల్లర్ గత నెల 21న కుంగిపోయింది. అయితే, ఆ సమయంలో అక్కడ పేలుడు శబ్దం వినిపించడంతో కుట్రకోణం ఉందనే అనుమానంతో అధికారులు దీనిపై విచారణ చేపట్టాలని మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు కూడా చేశారు. ఎన్నికల నేపథ్యంలో లబ్ధిపొందేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్ర చేసి ఉంటాయనే అనుమానాలు వినిపించాయి. తాజాగా కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. మేడిగడ్డ వద్ద ఒక పిల్లర్ మాత్రమే కుంగిందని అటు ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నా.. స్వయానా కాంట్రాక్టర్ అయిన వెంకట్‌రెడ్డి మరో రెండు బరాజ్‌లు కూలిపోతాయని ముందస్తుగా ఎలా చెప్తున్నారని అనుమానం కలుగుతున్నది. మరో రెండు బరాజ్‌లు కొట్టుకుపోతాయని కాంగ్రెస్ నేతకు ఎలా తెలుసని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇది ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రగా ప్రజలు అనుమానిస్తున్నారు.

కాంగ్రెస్ పాపాల శతకం.. స్కాంగ్రెస్

బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం రూపొందించిన 'తెలంగాణలో కాంగ్రెస్ పాపాల శతకం', 'స్కాంగ్రెస్' పుస్తకాలను మంగళవారం తెలంగాణ భవన్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కవులు శతకపద్యాలు రాసినట్టు, చిత్రగుప్తుడు మానవుల పాపాల చిట్టా రాసినట్టు కాంగ్రెస్ పాపాల గురించి శతకాలు, గ్రంథాలు రాయాల్సి వస్తున్నదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు వై సతీశ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, దినేశ్ దరి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడో ఓసారి సీఎం అవుతా

- మరోసారి కోరికను బయటపెట్టిన కోమటిరెడ్డి
- ఉద్యోగాలిస్తే.. పథకాలు అవసరం లేదు
- నల్లగొండలో రోడ్ షోలో ఎంపీ వెంకట్‌రెడ్డి వెల్లడి

> ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాను సీఎం కావాలన్న కోరికపైనే కాదు.. సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులపైనా సంచలన వ్యాఖ్యలు చేశారు. యువకులకు ఉద్యోగాలు ఇస్తే సంక్షేమ పథకాలు అవసరం లేదంటూ మాట్లాడారు. 'మీ కుటుంబంలో మీకు రైతుబంధో, గొర్రెలో, చేపలో కాదు.. ఉద్యోగాలు ఇస్తే మీరు అమ్మానాన్నలను సాదుకోలేరా' అంటూ ప్రశ్నించారు.

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం కావాలనుకున్న కోరికను మరోసారి బయటపెట్టుకున్నారు. మంగళవారం నల్లగొండ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా వెంకట్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన ప్రసంగిస్తూ.. నల్లగొండ నుంచి ఎప్పుడో ఓ సారి తాను సీఎం అవుతానని, అయితే.. ఆ విషయంలో తనకేం తొందర లేదని చెప్పారు. నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు తాను సీఎం కావచ్చని వ్యాఖ్యానించారు. సాగర్‌లో సీనియర్ నేత జానారెడ్డి ఈసారి పోటీ నుంచి తప్పుకొని కొడుకు జయవీర్‌రెడ్డిని బరిలోకి దింపారు. ఆయనకు మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో పాల్గొని సీఎం కావాలన్న కోరికను జానారెడ్డి బయటపెట్టారు. 'పదవుల రేసులో నేనెప్పుడూ లేను. పదవే రేస్‌లో ఉండి నన్ను అందుకుంటున్నది. నేను సీఎం కాదలుచుకుంటే' అంటూనే ఎంపీగా లేకున్నా పీవీ నర్సింహారావు ప్రధాని కాలేదా? అలాగే తానూ సీఎం కాగలనని చెప్పుకొచ్చారు. 'తెలుగు రాష్ట్రాల్లో నన్ను గౌరవిస్తున్నరు.. నన్ను సీఎంగా చూడాలని ప్రజలు కోరుతున్నరు. సీఎం కావాలన్న ప్రజల కోరిక నాకు తెల్వకుండానే తీరవచ్చు' అంటూ జానారెడ్డి మనస్సులోని మాటను బయటపెట్టారు. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, హుజూర్‌నగర్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం సీఎం రేస్‌లో ఉన్నట్టు క్యాడర్‌తో చెప్పకనే చెప్తున్నారు. ఎమ్మెల్యేగా గట్టెక్కడం అంత సులభంగా లేకపోవడంతో 'మీరు గెలిపిస్తే నేను సీఎం కూడా అవుతా' అని ఓటర్లను బుట్టలో వేసుకునే ప్రయత్నాలను కాంగ్రెస్ అభ్యర్థులు ముమ్మరం చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కే మాదిగల మద్దతు

- ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీలో తీర్మానం
- మోసకారి కాంగ్రెస్, బీజేపీకి ఓటేయొద్దు
- సంఘం ముఖ్య నేతలు వంగపల్లి, మేడి

ముషీరాబాద్, నవంబర్ 7: ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చిన బీఆర్ఎస్‌కే వచ్చే ఎన్నికల్లో మాదిగలు, మాది గ ఉపకులాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ వెల్లడించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి ఢిల్లీకి రాష్ట్ర ప్రతినిధి బృందాన్ని పంపారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని మాదిగల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తున్నదని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించకుండా మాదిగ యువకుల ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్, వంద రోజుల్లో వర్గీకరణ అంటూ మోసం చేసిన బీజేపీకి మాదిగ, ఉపకులాల ప్రజలు ఓటు వేయొద్దని కోరారు.

కాంగ్రెస్‌లో టి'కోట్లు' పంచుకొనుడే!

- కొత్త వారికి, డబ్బులు ఉన్నోళ్లకే అందలం
- ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నది నకిలీ కాంగ్రెస్
- భార్య నగలు కుదువపెట్టి పార్టీకి పనిచేశా
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవికి గుడ్ బై
- సత్తుపల్లి నుంచి రెబల్‌గా బరిలో దిగుతా
- కాంగ్రెస్‌పై మానవతారాయ్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో టికెట్లు ఇవ్వడం లేదని, ఎవరికి వారు పంచుకోవడమే ఉన్నదని ఓయూ విద్యార్థి నేత, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వాళ్లకు, డబ్బులు ఉన్నోళ్లకే టికెట్ దక్కుతున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పునాదులు కదులుతున్నాయని, పార్టీ అసలు కాంగ్రెస్, నకిలీ కాంగ్రెస్‌గా మారిపోయిందని అన్నారు. పార్టీ కోసం 23 ఏండ్లుగా పని చేస్తున్న తనకు కాదని, నిన్న మొన్న పార్టీలో చేరిన మట్టా రాజమయికి సత్తుపల్లి టికెట్ కేటాయించడం దారుణమని మండిపడ్డారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. సత్తుపల్లిలో రెబల్‌గా బరిలో దిగుతానని, ఈ నెల 9 లేదా 10న నామినేషన్ వేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీపై తన ఆగ్రహాన్ని, ఆవేదనను మానవతారాయ్ 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు.

రాహుల్‌గాంధీ ఏం సమాధానం చెప్తారు?

ఓయూ నుంచి ఎన్ఎస్‌యూఐ ద్వారా పెద్ద ఎత్తున నిరుద్యోగుల సమస్యపై పోరాటం చేసి ఇప్పుడు తానే శాశ్వత నిరుద్యోగిగా మిగిలిపోయానని మానవతారాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన వారికే న్యాయం చేయలేని కాంగ్రెస్ ఇక నిరుద్యోగులకు ఏం న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. పార్టీ కోసం సర్వస్వం కోల్పోయానని, తన భార్య నగలు తాకట్టు పెట్టి పార్టీ కోసం పని చేశానని పేర్కొన్నారు. 'పార్టీ కోసం పని చేయండి.. న్యాయం జరుగుతుంది' అని స్వయంగా రాహుల్‌గాంధీనే గతంలో హామీ ఇచ్చారని, మరి ఇప్పుడు ఆయన ఏం సమాధానం చెప్తారని నిలదీశారు.

పార్టీ పునాదులు కదులుతున్నాయ్..

ఖమ్మం జిల్లాలో పొంగులేటి, భట్టి విక్రమార్క, రేణుకాచౌదరి ఎవరికి వారు టికెట్లు పంచుకున్నారని మానవతారాయ్ ఆరోపించారు. కాంగ్రెస్ తన సహజత్వాన్ని కోల్పోతుందని, పార్టీ పునాదులు కదులుతున్నాయని, ఇది పార్టీకి ప్రమాద ఘంటికలని అన్నారు.

The Singareni Collieries Company Limited
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM- 507101